

జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

## భద్రాద్రి కొత్తగూడెం

శనివారం | 15 | ఆగస్టు | 2026 ◆ పేజీలు : 5


# విద్యార్థుల భవిష్యత్తుకు నాణ్యమైన విద్యే పునాది

- ఎమ్మెల్యే జారే ఆదినారాయణ



**ములకలపల్లి, ఆగస్టు 14 (ప్రజా జ్యోతి):** విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు నాణ్యమైన విద్యే పునాది అని ఎమ్మెల్యే జారే ఆదినారాయణ అన్నారు. శుక్రవారం సర్పంచ్ రాధా, ఏటీడీవో చంద్ర మోహన్ లతో కలిసి కమలాపురం ఆశ్రమ పాఠశాలలో నిర్వహించిన ప్రార్థనా కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థుల కు అందజేసే 'ఉద్దీపకం' పుస్తకాలను ఆవిష్కరించారు. అనంతరం పాఠశాలలో నిర్వహిస్తున్న వివిధ విద్యా కార్యక్రమాలను పరిశీలించారు. విద్యార్థులలో విద్యతో పాటు క్రమశిక్షణ, నైపుణ్యాలు, సృజనాత్మకతను పెంపొందించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు చి. బుచ్చిరాములు, డిప్యూటీ వార్డెన్ ప్రత్యూష, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



# డిసెంబర్ నాటికి వంద పడకల ఆసుపత్రి నిర్మాణం పూర్తి చేయాలి

- పనులు వేగవంతం చేయాలి
- నాణ్యతలో రాజీ పడొద్దు
- తాగునీటి అవసరాలకు ప్రాధాన్యతనిస్తూ నీటిని పొదుపుగా వినియోగించాలి
- వరి సాగును తగ్గించి ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహించాలి
- విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలి: జిల్లా కలెక్టర్ అంకిత్

**ఇల్లందు, ఆగస్ట్ 14 (ప్రజాజ్యోతి )** ఇల్లందు పట్టణంలో జిల్లా కలెక్టర్ అంకిత్ శుక్రవారం విస్తృతంగా క్షేత్ర స్థాయి పరిశీలనలు నిర్వహించారు. రూ.37.50 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న ఇల్లందు వంద పడకల ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణ పనులు, ఇల్లందు చెరువులో నీటి నిల్వలు, సుందిమళ్ల టీజీడబ్ల్యూఆర్ఎస్ పాఠశాల, కళాశాలలో విద్యార్థులకు అందుతున్న విద్య, వసతి, భోజనం, మౌలిక వసతులను పరిశీలించారు. సంబంధిత అధికారులతో ఆయా అంశాలపై సమీక్షించి పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. ముందుగా ఇల్లందు పట్టణంలో రూ.37.50 కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మిస్తున్న వంద పడకల ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణ పనులను పరిశీలించి ఇప్పటి వరకు పూర్తయిన పనులు, ప్రస్తుతం కొనసాగుతున్న

మిగతా 2 లో...

# రక్తదాతలు... నిజమైన హీరోలు

- రక్తదానం ద్వారా అమూల్యమైన ప్రాణాలను కాపాడవచ్చు
- డి ఎం హెచ్ ఓ తుకారం రాథోడ్





**కొత్తగూడెం కలెక్టరేట్ ,ఆగస్టు 14,(ప్రజాజ్యోతి)** రక్తదానం చేసి ఆపదలో ఉన్న వారి ప్రాణాలను కాపాడే రక్తదాతలు నిజమైన హీరోలని జిల్లా వైద్య ,ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ తుకారాం రాథోడ్ అన్నారు. స్థానిక ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో లీగల్ సర్వీసెస్ అథారిటీ, భద్రాద్రి కొత్తగూడెం ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ తుకారాం రాథోడ్, సీనియర్ సివిల్ జడ్జి కం సెక్రటరీ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ రాజేందర్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు రక్తదాన శిబిరాన్ని ప్రారంభించి, రక్తదానం చేసిన దాతలను అభినందించారు. ఈ సందర్భంగా డాక్టర్ తుకారాం రాథోడ్ మాట్లాడుతూ, ఒక వ్యక్తి ఇచ్చే రక్తం మరొక వ్యక్తికి ప్రాణదానం చేయగలదని అన్నారు. ప్రమాదాలు, శస్త్రచికిత్సలు, ప్రసవ సమయంలో అధిక రక్తస్రావం, అత్యవసర వైద్య పరిస్థితుల్లో సకాలంలో రక్తం అందుబాటులో లేకపోతే ప్రాణనష్టం

మిగతా 2 లో...

# బి.జె.పి. ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలను ప్రతి ఒక్కరు ఖండించాలి

- డీ.సీ.ఎం.ఎస్ మాజీ ఛైర్మన్ కొత్వాల
- జాతీయ కాంగ్రెస్ అధ్యక్షులు ఖర్గే పై బి.జె.పి. మతోన్మాద శక్తులు చేసిన దళిత వివక్షతను నిరసిస్తూ కొత్తగూడెంలో కాంగ్రెస్ పార్టీ నిరసన ర్యాలీ
- నిరసన కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షురాలు దేవి ప్రసన్న, అశ్వారావుపేట ఎం.ఎల్.ఎ జారె ఆదినారాయణ తో కలిసి పాల్గొన్న కొత్వాల





**కొత్తగూడెం కలెక్టరేట్ ,ఆగస్టు 14 ,(ప్రజా జ్యోతి)** కేంద్రంలోని బి.జె.పి. ప్రభుత్వం దేశవ్యాప్తంగా చేపడుతున్న ప్రజావ్యతిరేక విధానాలను దేశ ప్రజలు ఖండించాలని డీ.సీ.ఎం.ఎస్ మాజీ ఛైర్మన్, రాష్ట్ర మార్క్ఫెడ్ మాజీ డైరెక్టర్, పాల్వంచ సొసైటీ అధ్యక్షులు

మిగతా 2 లో...

# సింగరేణి భవనాలపై సౌర వెలుగులు

- కార్పొరేట్ పరిధిలో 1.23 మెగావాట్ల రూఫ్‌టాప్ సోలార్ ప్లాంట్లు ప్రారంభం
- సింగరేణి వ్యాప్తంగా ఇప్పటికే 245.5 మెగా వాట్ల సౌర విద్యుత్ ఉత్పత్తి



**కొత్తగూడెం, ఆగస్టు 14, ప్రజాజ్యోతి :** బొగ్గు ఉత్పత్తితో పాటు పునరుత్పాదక ఇంధన రంగంలోనూ సింగరేణి విస్తరిస్తోంది. కొత్తగూడెంలోని సింగరేణి కార్పొరేట్ పరిధిలోని సంస్థ భవనాలపై ఏర్పాటు చేసిన 1.23 మెగా వాట్ల రూఫ్‌టాప్ సోలార్ పవర్ ప్లాంట్లను సంస్థ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ డా. బుద్ధ ప్రకాశ్ జ్యోతి శుక్రవారం ప్రారంభించి గ్రిడ్‌కు అనుసంధానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణి అంటే బొగ్గు ఉత్పత్తి సంస్థగా ఉన్న గుర్తింపును దాటి థర్మల్ విద్యుత్‌తో పాటు సోలార్, ఫ్లోటింగ్ సోలార్ విద్యుత్ ఉత్పత్తి రంగాల్లోనూ సంస్థ తనదైన ముద్ర వేస్తోందన్నారు. పర్యావరణహిత

మిగతా 2 లో...

## సింగరేణి భవనాలపై సౌర వెలుగులు

(మొదటి పేజీ తరువాయి...)

చర్యల్లో భాగంగా సంస్థ పరిధిలోని ఖాళీ ప్రదేశాల్లో ఇప్పటివరకు 245.5 మెగావాట్ల సోలార్ ప్లాంట్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సింగరేణి భవనాలపై రూఫ్‌టాప్ సోలార్ ప్లాంట్ల ఏర్పాటును కూడా కొనసాగిస్తున్నామని, అందులో భాగంగానే కార్పొరేట్ పరిధిలో 1.23 మెగావాట్ల సామర్థ్యంతో ఏర్పాటు చేసిన ప్లాంట్లను ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాలకు అనుగుణంగా దేశ, రాష్ట్ర ఇంధన అవసరాలను తీర్చేందుకు భవిష్యత్తులో మరిన్ని సోలార్ ప్లాంట్లను ఏర్పాటు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో డైరెక్టర్లు ఎల్.వి. సూర్యనారాయణ, కె. వెంకటేశ్వర్లు, ఎం. తిరుమల రావుతో పాటు పలువురు ఉన్నతాధికారులు, ఉద్యోగులు, కార్మిక సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## బి.జె.పి. ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలను ప్రతి ఒక్కరు ఖండించాలి

(మొదటి పేజీ తరువాయి...)

కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. జాతీయ కాంగ్రెస్ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే పై బి.జె.పి. మతోన్మాద శక్తులు చేసిన దళిత వివక్షను నిరసిస్తూ ఎ.ఐ.సి.సి, పి.సి.సి. ల పిలుపు మేరకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం కొత్తగూడెంలో నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. కొత్తగూడెం పట్టణంలో భారీ నిరసనా ర్యాలీ, సత్యాగ్రహ దీక్ష, రైల్వే స్టేషన్ సెంటర్ లో గాంధీ విగ్రహం వద్ద సత్యాగ్రహం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు తోట దేవి ప్రసన్న, అశ్వారావుపేట శాసనసభ్యులు జారె ఆదినారాయణ ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా కొత్వాల మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల, జాతీయ కాంగ్రెస్ నాయకులపై దాడులు చేస్తున్న బి.జె.పి. ప్రభుత్వం పతనం తప్పదన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న బి.జె.పి. ప్రభుత్వం కుప్పకూలడం ఖాయం అని కొత్వాల హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రక్తదాతలు నిజమైన హీరోలు

(మొదటి పేజీ తరువాయి...)



సంభవించే అవకాశం ఉందన్నారు. ముఖ్యంగా రోడ్డు ప్రమాదాలు, ఆకస్మిక ప్రమాదాలు , తీవ్రమైన రక్తస్రావం జరిగే సందర్భాల్లో తక్షణమే రక్తం అవసరమవుతుందని, అలాంటి సమయంలో రక్తదాతలు ముందుకు రావడం ఎంతో కీలకమని తెలిపారు. రక్తాన్ని కృత్రిమంగా తయారు చేయడం సాధ్యం కాదని, ఒక మనిషి నుంచి మరొక మనిషికి రక్తదానం ద్వారానే రక్తాన్ని అందించగలమని పేర్కొన్నారు. ప్రతి ఆరోగ్యవంతమైన వ్యక్తి నిర్దిష్ట వ్యవధిలో రక్తదానం చేయడం ద్వారా సమాజానికి విలువైన సేవ చేయవచ్చని, యువత రక్తదానంపై అవగాహన పెంచుకొని స్వచ్ఛందంగా రక్తదాన శిబిరాల్లో పాల్గొనాలని డీఎంహెచ్ఓ పిలుపునిచ్చారు. “రక్తదానం చేయండి – ప్రాణాలను కాపాడండి” అనే సందేశాన్ని ప్రతి ఒక్కరూ ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు.

### ఫ్రైడే–డ్రై డే కార్యక్రమంపై ఆకస్మిక తనిఖీ

రక్తదాన శిబిరం అనంతరం డీఎంహెచ్ఓ డాక్టర్ తుకారాం రాథోడ్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సఫాయి బస్తీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు, ముఖ్యంగా దోమల ద్వారా వ్యాప్తి చెందే వ్యాధులను అరికట్టేందుకు నిర్వహిస్తున్న ఫ్రైడే–డ్రై డే కార్యక్రమం అమలును పరిశీలించారు. బస్తీలో నీటి నిల్వలు, పరిసరాల పరిశుభ్రత, దోమల వృద్ధికి అనుకూలమైన ప్రాంతాలను పరిశీలించి, ప్రజలకు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం, ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూడటం, దోమల నివారణ చర్యలు చేపట్టడం వంటి అంశాలపై అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. అనంతరం ఆరోగ్య సిబ్బందితో సమీక్ష నిర్వహించి, ప్రతి శుక్రవారం డ్రై డే కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని, ప్రజల భాగస్వామ్యంతో దోమల పెరుగుదలను నియంత్రించాలని ఆదేశించారు. ఫీల్డ్ స్థాయిలో సిబ్బంది నిరంతరం పర్యటిస్తూ, సీజనల్ వ్యాధుల నివారణ చర్యలను పర్యవేక్షించాలని సూచించారు. సాధారణ కాన్పులను పెంచాలని, ఈ డి డి ప్రకారం గర్భిణీ స్త్రీలను హాస్పిటల్లో కాన్పు అయ్యే విధంగా ప్రోత్సహించాలని వారిని ప్రతిరోజు పర్యవేక్షణ చేయాలని ఐ రిస్క్ గర్భిణీలను ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలని వారిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు ఎన్ సి డి భాగంగా 30 సంవత్సరాలు దాటిన అందరికీ స్క్రీనింగ్ నిర్వహించాలని బిపి, షుగర్ ,వ్యాధిగ్రస్తులకు క్రమం తప్పకుండా నెల నెల మందులు అందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాధామోహన్, డాక్టర్ సీతారాం, బ్లడ్ బ్యాంక్ వైద్యాధికారి డాక్టర్ సురేందర్ , యు పి హెచ్ సి సఫాయి బస్తీ సిబ్బంది శ్రీనివాస్, జగదీష్ , శారద విజయలక్ష్మి , సంగీత, సుమంత్ పావని , ఆరోగ్య సిబ్బంది, రక్తదాతలు పాల్గొన్నారు.

# డిసెంబర్ నాటికి వంద పడకల ఆసుపత్రి నిర్మాణం పూర్తి చేయాలి





(మొదటి పేజీ తరువాయి...)

పనుల పురోగతిని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రి నిర్మాణ మ్యాప్‌ను పరిశీలిస్తూ ఇన్ పేషెంట్, ఔట్ పేషెంట్ విభాగాలు, ఐసీయూ, ఎమర్జెన్సీ విభాగం, వార్డులు, వెయిటింగ్ హాల్, మరుగుదొడ్లు తదితర సదుపాయాల ఏర్పాటుపై అధికారులతో చర్చించారు. ఆసుపత్రికి వచ్చే రోగులు, వారి సహాయకులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని విభాగాలను సౌకర్యవంతంగా, ప్రణాళికాబద్ధంగా ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు. నూతన వంద పడకల ఆసుపత్రి అందుబాటులోకి వస్తే ఇల్లందు పరిసర ప్రాంతాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. అత్యవసర వైద్య సేవలు సకాలంలో అందేలా ఎమర్జెన్సీ, ఐసీయూ తదితర విభాగాలను అవసరమైన సౌకర్యాలతో ఏర్పాటు చేయాలని ఆదేశించారు. డిసెంబర్ నాటికి ఆసుపత్రి నిర్మాణ పనులను పూర్తిస్థాయిలో పూర్తి చేసేలా కార్యాచరణ రూపొందించుకొని పనుల్లో వేగం పెంచాలని సూచించారు. నిర్మాణ సంస్థ, సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలను ఎట్టి పరిస్థితుల్లోనూ తగ్గించవద్దని, ఉపయోగించే నిర్మాణ సామగ్రి నాణ్యతను ఎప్పటికప్పుడు పరిశీలించాలని ఆదేశించారు. పనుల నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ లేకుండా నిర్దేశిత ప్రమాణాల ప్రకారం నిర్మాణ పనులు చేపట్టాలని స్పష్టం చేశారు. అనంతరం ఇల్లందు ప్రజలకు మంచినీరు అందించే చెరువును పరిశీలించారు. చెరువులోని ప్రస్తుత నీటిమట్టం, నీటి నిల్వ, పూర్తి స్థాయి నీటిమట్టం, గరిష్ట నీటిమట్టం, రోజువారీ తాగునీటి అవసరాలకు వినియోగిస్తున్న నీటి పరిమాణం, నీటి డిశ్చార్జ్ తదితర వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. చెరువు పూర్తి స్థాయి నీటిమట్టం 219.150 మీటర్లు, గరిష్ట నీటిమట్టం 219.750 మీటర్లు కాగా, పూర్తి నిల్వ సామర్థ్యం 45 ఎంసీఎఫ్‌టీ, నీటి విస్తీర్ణం 136.23 ఎకరాలు, క్యాచ్‌మెంట్ ఏరియా 26 చదరపు కిలోమీటర్లుగా ఉందని అధికారులు తెలిపారు. రోజువారీ తాగు నీటి అవసరాల కోసం 0.0177 ఎంసీఎఫ్‌టీ నీటిని వినియోగిస్తున్నామని, ఇది సుమారు 5.01 లక్షల లీటర్లకు సమానమని అధికారులు వివరించారు. అందుబాటులో ఉన్న నీటి నిల్వలను తాగునీటి అవసరాలకు ప్రాధాన్యతనిస్తూ ప్రణాళికాబద్ధంగా వినియోగించాలని సూచించారు. భవిష్యత్ తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకొని నీటి నిర్వహణ చేపట్టాలని, నీటి వృథాను అరికట్టేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. చెరువు నీటి వినియోగం, సాగునీటి పరిస్థితిపై వ్యవసాయ శాఖ అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఇల్లందు పరిధిలోని వ్యవసాయ భూములకు చెరువుల ద్వారా అందుతున్న సాగునీటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. రొంపేడు, చల్లసముద్రం తదితర ప్రాంతాల్లో చెరువుల నీటితో సాగు చేస్తున్న పంటలు, సాగు విస్తీర్ణం, సాగునీటి లభ్యత తదితర వివరాలను తెలుసుకున్నారు. అందుబాటులో ఉన్న నీటి వనరులను దృష్టిలో ఉంచుకొని రైతులు వరి సాగును తగ్గించి, తక్కువ నీటితో సాగు చేసే ప్రత్యామ్నాయ పంటల వైపు దృష్టి సారించేలా అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా పెసర వంటి ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహించాలని సూచించారు. విద్యా సంస్థల పనితీరుపై దృష్టి సారించిన కలెక్టర్, ఇల్లందు మున్సిపాలిటీ పరిధిలోని సుదిమళ్ల టీజీడబ్ల్యూఆర్ఎస్ పాఠశాల, కళాశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న విద్య, వసతి, భోజనం, మౌలిక వసతులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. 10వ తరగతి విద్యార్థులతో నేరుగా మాట్లాడి పాఠశాలలో అందుతున్న సదుపాయాలు, విద్యాబోధన, పాఠ్యపుస్తకాలు, యూనిఫార్మ్‌లు, వసతి, భోజనం తదితర అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. గత విద్యా సంవత్సరంలో 10వ తరగతి విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించారని ప్రధానోపాధ్యాయులు కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గత సంవత్సరం సాధించిన ఫలితాలను కొనసాగిస్తూ ఈ విద్యా సంవత్సరంలోనూ విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని సూచించారు. చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారికి ప్రత్యేక బోధన అందించాలని, ప్రతి విద్యార్థి విద్యా ప్రగతిని ఉపాధ్యాయులు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. పాఠశాలలోని లైబ్రరీ, కంప్యూటర్ ల్యాబ్ తదితర సదుపాయాలను విద్యార్థులు సక్రమంగా వినియోగిస్తున్నారా అని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల్లో పఠన అలవాట్లు, సాంకేతిక పరిజ్ఞానం పెంపొందేలా అందుబాటులో ఉన్న సదుపాయాలను సమర్థవంతంగా వినియోగించేలా చూడాలని సూచించారు. పాఠశాల భవనంలో వర్షాకాలంలో లీకేజీ సమస్యతో పాటు భోజనశాలలో కూడా లీకేజీలు ఉన్నాయని ప్రధానోపాధ్యాయులు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన కలెక్టర్ సమస్యల పరిష్కారానికి అవసరమైన ప్రతిపాదనలను వెంటనే సిద్ధం చేసి పంపించాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా మరమ్మతు పనులను ప్రాధాన్యతతో చేపట్టాలని సూచించారు. భోజనశాలను పరిశీలించిన కలెక్టర్ విద్యార్థులకు ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. వంటకు వినియోగిస్తున్న గ్యాస్ సిలిండర్లు, ఆహార పదార్థాల సరఫరా, ఫుడ్ మానిటరింగ్ కమిటీ పనితీరు తదితర వివరాలను తెలుసుకున్నారు. విద్యార్థులకు ప్రతి రోజూ మెనూ ప్రకారం నాణ్యమైన, పౌష్టికాహారం అందించాలని, ఆహార నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడవద్దని అధికారులను ఆదేశించారు. స్టోర్ రూమ్‌ను పరిశీలించిన కలెక్టర్ అక్కడ నిల్వ ఉంచిన బియ్యం, పప్పులు, ఇతర నిత్యావసర సరుకులు, కూరగాయల నాణ్యతను స్వయంగా పరిశీలించారు. సరుకులను సక్రమంగా నిల్వ చేయాలని, నిల్వల వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేయాలని సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతి, పరిశుభ్రమైన వాతావరణం, పౌష్టికాహారం అందించడం అధికారుల బాధ్యత అని అన్నారు. పాఠశాలలో గుర్తించిన సమస్యలను వెంటనే పరిష్కరించి విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ షా ఖాసీం, ఎంపీడీఓ దన్ సింగ్, మున్సిపల్ కమిషనర్ సందీప్, ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రశేఖర్, వైద్యులు, ప్రధానోపాధ్యాయులు, ఇంజనీరింగ్ శాఖ అధికారులు, వ్యవసాయ శాఖ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.





# మండల ప్రజావాణిని సమర్థవంతంగా నిర్వహించాలి

- ఈ నెల 17వ తేదీ సోమవారం నుంచి మండల స్థాయిలో ప్రజావాణి
- ప్రజల సమస్యలకు త్వరితగతిన పరిష్కారం చూపాలి
- జిల్లా కలెక్టర్ అంకిత్



**కొత్తగూడెం కలెక్టరేట్, ఆగస్టు 14 , (ప్రజా జ్యోతి )** ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు మండల స్థాయిలో ప్రజావాణి కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు.జిల్లా కలెక్టర్ అంకిత్ ఆదేశాల మేరకు జిల్లా ఈ డిస్టిక్ మేనేజర్ సైదేశ్వరరావు, జిల్లా ప్రజావాణి సూపరింటెండెంట్ రంగు రమేష్‌తో కలిసి శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మండల స్థాయి ఆపరేటర్లకు ప్రజావాణి నిర్వహణపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఈ డిస్టిక్ మేనేజర్ సైదేశ్వరరావు మాట్లాడుతూ ఈ నెల 17వ తేదీ సోమవారం నుంచి అన్ని మండల కేంద్రాల్లోని ఎంపీడీవో కార్యాలయాల్లో మండల ప్రజావాణి నిర్వహించనున్నట్లు తెలిపారు. మండల కేంద్రాల్లోనే ప్రజల నుంచి వినతులు స్వీకరించి,సమస్యలను త్వరితగతిన పరిష్కరించడం ద్వారా ప్రజలకు సమయం, ప్రయాణ ఖర్చు ఆదా అవుతుందన్నారు. ప్రతి ఫిర్యాదును బాధ్యతగా స్వీకరించి, సంబంధిత శాఖలకు వెంటనే పంపించాలని, పరిష్కార పురోగతిని ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు.అనంతరం జిల్లా ప్రజావాణి సూపరింటెండెంట్ రంగు రమేష్ మాట్లాడుతూ మండల ప్రజావాణికి వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. ప్రజల నుంచి వచ్చే ప్రతి వినతిని సక్రమంగా నమోదు చేసి, సంబంధిత అధికారులకు వెంటనే చేరవేయాలని తెలిపారు. ఫిర్యాదుల పరిష్కారంపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ ఉండేలా చర్యలు తీసుకోవాలని, ప్రజలకు వేగవంతమైన సేవలు అందేలా సిబ్బంది బాధ్యతగా పనిచేయాలని సూచించారు.అనంతరం మండల స్థాయి ఆపరేటర్లకు ఫిర్యాదుల నమోదు, సంబంధిత శాఖలకు పంపడం, పరిష్కార ప్రక్రియ, ఆన్‌లైన్‌లో పురోగతి నమోదు తదితర అంశాలపై శిక్షణ అందించారు.

# మలేరియా నివారణకు స్ప్రేయింగ్

- దోమల నిర్మూలనతోనే మలేరియాకు అడ్డుకట్ట డాక్టర్ హారిక



**చర్ల, ఆగస్టు 14 :(ప్రజా జ్యోతి):** మలేరియా నివారణకు వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు పటిష్ట చర్యలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం మలేరియా ప్రభావిత ప్రాంతాలైన క్రాంతిపురం, గొల్లగూడెం, రేగుంట, సి.కొత్తూరు గ్రామాల్లో గురువారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం చర్ల మెడికల్ ఆఫీసర్ డాక్టర్ హారిక ఆధ్వర్యంలో ఆల్ఫాసైపర్ మెత్రిన్ 5 శాతం ద్రావణంతో స్ప్రేయింగ్ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా డాక్టర్ హారిక మాట్లాడుతూ దోమలు ఇంటి పరిసరాల్లో పెరగకుండా ప్రజలు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని దోమల నివారణలో లార్వా దశ కీలకమని దోమ లార్వాలు ప్రారంభ దశలో నీటిలోనే ఉంటాయని తెలిపారు. ఈ దశలోనే వాటిని నివారించడం ద్వారా దోమల వ్యాప్తిని సమర్థవంతంగా అరికట్టవచ్చని చెప్పారు.ప్రజలు ప్రతి శుక్రవారం 'ఫ్రైడే డ్రై డే'తో పాటు ప్రతి మంగళవారం కూడా డ్రై డే పాటించాలని సూచించారు. ఇళ్ల పరిసరాల్లో నీరు మూడు రోజులకు మించి నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని నీరు నిల్వ ఉండే పాత్రలు, టైర్లు, కొబ్బరి చిప్పలు తదితరాలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని సూచించారు. సాధ్యమైనంత వరకు దోమతెరలను వినియోగిస్తూ దోమలు పుట్టకుండా, కుట్టకుండా తగిన జాగ్రత్తలు పాటించాలని ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సబ్ యూనిట్ ఆఫీసర్ ధర్మారావు, హెల్త్ సూపర్ వైజర్ రామ్ ప్రసాద్, హెల్త్ అసిస్టెంట్ ధర్మారావు, ఆశా కార్యకర్త సబిత పాల్గొన్నారు.

# ఆదిదేవుడు వినాయకుని ఆశీస్సులే సకలమానవాళికి శ్రీరామ రక్ష

- కర్రపూజలో పాల్గొన్న కొత్వాల, కార్పొరేటర్ విమలాదేవి దంపతులు

**కొత్తగూడెం కలెక్టరేట్ ,ఆగస్టు 14,(ప్రజా జ్యోతి )** ఆదిదేవుడు వినాయకుని ఆశీస్సులే సకలమానవాళికి శ్రీరామ రక్ష, అని డి.సి.ఎం.ఎస్ మాజీ ఛైర్మన్, రాష్ట్ర మార్క్ఫెడ్ మాజీ డైరెక్టర్, పాల్వంచ సొసైటీ అధ్యక్షులు కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. సెప్టెంబర్ నెలలో జరిగే గణేష్ నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా పాత పాల్వంచ గడియకట్ట లో గడియకట్ట(జిడికె) యూత్ ఆధ్వర్యంలో నిర్వహించే నిర్మాణ పనుల్లో భాగంగా శుక్రవారం కర్రపూజ నిర్వహించారు. ప్రముఖ పూజారి కందాళ ఆనంద కుమారా చార్యులు ఆధ్వర్యంలో నిర్వహించిన పూజల్లో కొత్వాల తో పాటు పాత పాల్వంచ 46వ డివిజన్ కార్పొరేటర్ కొత్వాల విమలాదేవి దంపతులు పాల్గొని, నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా కొత్వాల మాట్లాడుతూ నిత్యం వినాయకుణ్ణి ప్రథమంగా పూజించాలని, తద్వారా విఘ్నాలు తొలగుతాయన్నారు. పూజల ద్వారా వినాయకుని ఆశీస్సులు అందరికీ లభిస్తాయని కొత్వాల అన్నారు.ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కొత్వాల విమలాదేవి, మాజీ కౌన్సిలర్ కొత్వాల సత్యనారాయణ, కె.టి.పి.ఎస్ ఎ.డి.ఇ. చంద్రరేఖ, ఉత్సవాల నిర్వాహకులు బర్ల అన్వేష్, బట్టు సాగర్, బండ్ల ప్రశాంత్, మండిగ రమేష్, బూతం జగన్, కొండపెల్లి నాగరాజు, పిల్లల బాలాజీ, బండ్ల నీరజ్, వెంకీ, లాలు, నందు, గణేష్, వినయ్, మణి, సాయి, బన్ను, పవన్, వసంత్, కిరణ్, అభిలాష్, సురేష్, నరేష్, శ్రీకాంత్, గ్రామ పెద్దలు, బర్ల పాపారావు ముత్యాల కోటేశ్వరరావు, మసనం శరత్, కిరణ్, మల్లేష్, కిలారి సుజాత, బూసి శ్రీను,బొందిల బాలు, తదితరులు పాల్గొన్నారు.



# కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్‌పై స్టే ఎత్తివేయాలి

- బీఆర్ఎస్ మండల కన్వీనర్ దొడ్డి తాతారావు



**చర్ల, ఆగస్టు 14(ప్రజా జ్యోతి):** పేదింటి ఆడపిల్లలకు అండగా నిలిచే కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలపై హైకోర్టు స్టే విధించే పరిస్థితి కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి వల్లే ఏర్పడిందని చర్ల బీఆర్ఎస్ పార్టీ మండల కన్వీనర్ దొడ్డి తాతారావు ఆరోపించారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి సెప్టెంబరు 9లోగా హైకోర్టులో బలమైన కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేసి స్టే ఎత్తివేసేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.హైకోర్టులో దాఖలైన పిటిషన్‌పై విచారణ సందర్భంగా ప్రభుత్వం కౌంటర్ దాఖలు చేస్తామని అడ్వొకేట్ జనరల్ హామీ ఇచ్చినప్పటికీ న్యాయస్థానం పలుమార్లు అవకాశం కల్పించినా కౌంటర్ అఫిడవిట్ సమర్పించకపోవడం ప్రభుత్వ బాధ్యతారాహిత్యానికి నిదర్శనమని అన్నారు. పేద వర్గాలకు ఈ పథకాల ప్రయోజనాలు అందకుండా చేయాలనే ఉద్దేశంతోనే ప్రభుత్వం కోర్టు వ్యవహారాల్లో అలసత్వం ప్రదర్శిస్తోందని ఆరోపించారు.గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ లబ్ధిదారులకు ఆర్థిక సాయంతో పాటు అదనంగా తులం బంగారం ఇస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిందని అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీని అమలు చేయలేదని తాతారావు విమర్శించారు. కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం 2014 నుంచి అమలు చేసిన ఈ పథకాలు పేద కుటుంబాల్లోని ఆడపిల్లల వివాహాలకు ఆర్థిక భరోసా కల్పించాయని గుర్తుచేశారు.ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు చెందిన లక్షలాది మంది ఆడబిడ్డల వివాహాలకు ఈ పథకాలు అండగా నిలిచాయని ప్రతి ఏడాది సుమారు రూ.1,400 కోట్ల వరకు బడ్జెట్ కేటాయించి ఆర్థిక సహాయం అందించినట్లు తెలిపారు. ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న లబ్ధిదారులకు కూడా వెంటనే నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.ప్రభుత్వం సెప్టెంబరు 9లోగా హైకోర్టులో సమర్థవంతమైన కౌంటర్ దాఖలు చేయాలని అవసరమైతే చట్టసభల ద్వారా ఈ పథకాలకు ప్రత్యేక చట్టబద్ధత కల్పించి స్టే ఎత్తివేసేలా చర్యలు తీసుకోవాలని దొడ్డి తాతారావు కోరారు.

# రైతులకు అందుబాటులో ఎరువుల దుకాణం





**చర్ల, ఆగస్టు 14 (ప్రజా జ్యోతి ):** చర్ల మండలం సత్యనారాయణపురం గ్రామం లో ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎరువులు, పురుగు మందుల దుకాణాన్ని శుక్రవారం ఆత్మ కమిటీ చైర్మన్ ఇందల గోపాల బుచ్చిబాబు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ గ్రామీణ, ఏజెన్సీ ప్రాంతాల్లో రైతులకు అవసరమైన ఎరువులు, పురుగు మం దులు అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమన్నారు. ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ ద్వారా రైతులకు సేవలందించేందుకు దుకాణాలను ఏర్పాటు చేయడం మంచి పరిణామమని అన్నారు .రైతుల అవసరాలకు అనుగుణంగా సరైన సమయంలో నాణ్యమైన ఎరువులు, పురుగు మందులను దుకాణంలో అందుబాటులో ఉంచాలని సూచించారు. పంటలకు వచ్చే వ్యాధులు, తెగుళ్లను గుర్తించి వాటికి అనుగుణమైన మందులను రైతులకు సూచించి సరైన మందులనే అందించాలని కోరారు. రైతులకు వ్యవసాయంపై అవగాహన కల్పిస్తూ వారికి అవసరమైన సహకారం అందించాలని తెలిపారు.ఏజెన్సీ ప్రాంతంలో రైతులకు సేవ చేయాలనే ఉద్దేశంతో దుకాణాన్ని ఏర్పాటు చేసిన యాజమాన్యానికి ఆయన అభినందనలు తెలిపారు. ఈ దుకాణం ద్వారా పరిసర గ్రామాల రైతులకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని అన్నారు.ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ ఇందల గోపాల బుచ్చిబాబు, ఆర్.కొత్తగూడెం సర్పంచ్ తుర్రం రవికుమార్, బ్యాంక్ డైరెక్టర్ మంతెన శ్రీనివాసరాజు, గ్రామ పెద్దలు జోగిరాజు, నేతాని రాము, గొర్ల రాజు, వెంకట్రావు, పోలోజు నాగరాజు, ఇమ్రాన్, మురళి, సతీష్, వసంతచారి, రుంజ రాజా, శేషయ్య తదితరులు పాల్గొన్నారు.

# స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపిన పర్స వెంకట్

- దేశ స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకోవాలని పిలుపు



**అన్నపురెడ్డిపల్లి, ఆగస్టు 14 (ప్రజా జ్యోతి ):** అన్నపురెడ్డిపల్లి మండల ప్రజలకు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పర్స వెంకట్ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. దేశానికి స్వాతంత్ర్యం తీసుకురావడానికి ఎందరో స్వాతంత్ర్య సమరయోధులు చేసిన పోరాటాలు, త్యాగాలు చిరస్మరణీయమని అన్నారు. వారి త్యాగాల ఫలితంగానే మనం స్వేచ్ఛగా జీవిస్తున్నామని పేర్కొన్నారు. స్వాతంత్ర్య సమరయోధుల ఆశయాలను నేటి తరం ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. దేశ ఐక్యత, సమగ్రతను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. ప్రజాస్వామ్య విలువలను పరిరక్షిస్తూ దేశ అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. యువత విద్య, ఉపాధి రంగాల్లో రాణించి దేశ పురోగతికి తోడ్పడాలని ఆకాంక్షించారు. రైతులు, కార్మికులు, మహిళలు, యువతతో పాటు అన్ని వర్గాల ప్రజలు ఐకమత్యంతో ముందుకు సాగాలని తెలిపారు. మండల ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకుంటూ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

## నేతాజీ యువజన సంఘం సేవలు ఆదర్శనీయం

- డాక్టర్ సోమరాజు దొర
- ఘనంగా నేతాజీ యువజన సంఘం 34వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు
- ఎస్.జె.కె.అహ్మద్‌ను ఘనంగా సన్మానించిన సంఘ నాయకులు



**కొత్తగూడెం కలెక్టరేట్ ,ఆగస్టు 14 ,(ప్రజా జ్యోతి )** నేతాజీ యువజన సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు ఎస్.జె.కె. అహ్మద్ ఆధ్వర్యంలో చేపడుతున్న సేవా కార్యక్రమాలను యువత ఆదర్శంగా తీసుకొని సమాజ సేవకు పాటుపడాలని పాల్వంచ ప్రముఖ వైద్యులు డాక్టర్ సోమరాజు దొర పిలుపునిచ్చారు. శుక్రవారం పాల్వంచ పట్టణ పరిధిలోని వనమా కాలనీలోని నేతాజీ యువజన సంఘం కార్యాలయంలో 34వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను అధ్యక్షుడు ఎస్.జె.కె. అహ్మద్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డాక్టర్ సోమరాజు దొర హాజరై సంఘం సభ్యులతో కలిసి నేతాజీ సుభాష్ చంద్రబోస్ చిత్రపటానికి నివాళులర్పించి, కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా నేతాజీ యువజన సంఘం అధ్యక్షుడు ఎస్.జె.కె.అహ్మద్ ను నాయకులు, సంఘం సభ్యులు ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం డాక్టర్ సోమరాజు దొర మాట్లాడుతూ.. నేతాజీ యువజన సంఘాన్ని స్థాపించి 33 ఏళ్లుగా నిరుపేదలు, బాధితులు, నిస్సహాయులకు అండగా ఎస్.జె.కె. అహ్మద్ అందిస్తున్న సేవలు ఆదర్శప్రాయమని కొనియాడారు. ముఖ్యంగా కరోనా విపత్కర సమయంలో నేతాజీ యువజన సంఘం ఆధ్వర్యంలో పేదలు, నిరాశ్రయులకు అందించిన సేవలు అభినందనీయమన్నారు. "మానవ సేవే మాధవ సేవ" అనే నినాదంతో ఎటువంటి స్వార్థం లేకుండా నిరుపేదలు, బాధితులు, పీడితులు, నిస్సహాయులకు అండగా నిలుస్తూ అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించడం గొప్ప విషయమన్నారు. నేతాజీ యువజన సంఘంతో తనకు ఎంతోకాలంగా అనుబంధం ఉందని డాక్టర్ సోమరాజు దొర తెలిపారు. సంఘం నిర్వహించే ప్రతి సేవా కార్యక్రమంలోనూ భాగస్వామ్యం కావడం తనకు ఎంతో సంతోషంగా ఉంటుందని, తాను కూడా నేతాజీ యువజన సంఘం కుటుంబ సభ్యుడినేనని అన్నారు. సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమాలకు తనను ఆహ్వానిస్తూ సమాజ సేవలో భాగస్వామిని చేస్తున్న అధ్యక్షుడు ఎస్.జె.కె. అహ్మద్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రముఖ కాంట్రాక్టర్ కాల్వ దేవదాసు, సీనియర్ వైద్యులు డాక్టర్ నామ బుచ్చయ్య, పాల్వంచ కళా పరిషత్ ప్రధాన కార్యదర్శి వేముల కొండలరావు, జనతా ఫౌండేషన్ జాయింట్ సెక్రటరీ సయ్యద్ అక్బర్, ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ జిల్లా అధ్యక్షుడు బుడగం నాగేశ్వరరావు, సమగ్ర అభివృద్ధి వేదిక అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్, టీ.యు.ఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎండి మంజూర్, జమే మజీద్ కమిటీ జాయింట్ సెక్రటరీ ఎస్.కె.అక్బర్, జానపద కళాకారుల సంఘం జిల్లా అధ్యక్షుడు గద్దర్ భాష, టీ.వి.పి.ఎస్ పాల్వంచ మండల అధ్యక్షుడు ఎస్.ఏ.నయీమ్, రిటైర్డ్ సిఐ జారే బిక్షం,స్థానికులు చిమ్మి నాయుడు, సక్రు, బాబర్, ఓం ప్రకాష్, అచ్చయ్య నాయక్, లక్ష్మీ నాయుడు, సయ్యద్ నూర్జహాన్ పర్వీన్, టి.వరలక్ష్మి, టి.రాణి, కె.జీవమ్మ, మదీనా, సక్కుబాయి, భానుమతి, సృజన, పాల్గొన్నారు.

## కవాసి లఖ్మాకు విజయవంతమైన క్యాటరాక్ట్ శస్త్రచికిత్స






**కొత్తగూడెం కలెక్టరేట్, పాల్వంచ / ఆగస్టు 14, (ప్రజా జ్యోతి )** కొంటా నియోజకవర్గ కాంగ్రెస్ ఎమ్మెల్యే, ఛత్తీస్‌గఢ్ మాజీ మంత్రి కవాసి లఖ్మాకు పాల్వంచలోని నవభారత్ ఐ సెంటర్ (ఎల్ వి పి వి ఐ )కుడి కంటికి క్యాటరాక్ట్ శస్త్రచికిత్స విజయవంతంగా నిర్వహించారు. ఆగస్టు 13న డా. కొలిపాక గౌరీ ప్రతిన్య ఆధ్వర్యంలో శస్త్రచికిత్స పూర్తికాగా, అనంతరం ఆయనను శుక్రవారం ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ చేశారు. కేంద్రంలో అందించిన వైద్య సేవలు, రోగి సంరక్షణ పట్ల లఖ్మా సంతృప్తి వ్యక్తం చేసి వైద్యులు, సిబ్బందికి అభినందనలు తెలిపారు. ప్రజలకు నాణ్యమైన నేత్ర వైద్య సేవలు అందించడమే తమ లక్ష్యమని కేంద్రం అడ్మినిస్ట్రేటర్ శ్రీ దేవిచందర్ రావు తెలిపారు.

# ప్రెస్ క్లబ్ భవనం ప్రారంభం



- సేవ చేస్తూ భవనం నిర్మించుకోవడం సంతోషకరం
- ప్రజలకు ప్రభుత్వాలకు మధ్య వారధులు పత్రిక విలేకరులు



**గుండాల ఆగస్ట్ 14 ప్రజా జ్యోతి** ప్రజలకు ప్రభుత్వాలకు మధ్య వారదులుగా పనిచేస్తూ భవనం నిర్మించుకోవడం సంతోషకరమని తాసిల్దార్ బత్తిని సంగీత అన్నారు శుక్రవారం గుండాల మండల కేంద్రంలో నిర్మించిన ప్రెస్ క్లబ్ భవనాన్ని ప్రారంభించిన అనంతరం ఆమె మాట్లాడారు. హంగు ఆర్భాటాలతో నిర్మించిన ప్రెస్ క్లబ్ భవనాన్ని గుండాల ప్రముఖ వ్యాపారస్తులు మానాల వెంకటేశ్వర్లు ప్రారంభించారు అనంతరం ప్రెస్ క్లబ్ అధ్యక్షులు యాసారపు తిరుపతి అధ్యక్షతన జరిగిన కార్యక్రమం ఉద్దేశించి తాసిల్దార్ మాట్లాడుతూ మారుతున్న సమాజానికి అనుకూలంగా ప్రజా సమస్యలపై అనునిత్యం పనిచేస్తూ సమస్యలను అటు ప్రభుత్వానికి ఇటు అధికారులకు తెలియజేస్తూ పని చేస్తున్న విలేకరులను గుర్తించడంతోపాటు, భవనాన్ని నిర్మించుకోవడం ఎంతో సంతోషకరమన్నారు. గుండాల మండల అభివృద్ధి అధికారి బాలరాజు, గుండాల ఎస్సై శ్రావణ్ కుమార్ లు మాట్లాడుతూ సమాజాన్ని మేల్కొల్పే జర్నలిస్టులు ఐక్యంగా ఉంటూ ఈ భవనాన్ని నిర్మించుకోవడం తమకే కాక అవసరాల కోసం ప్రజలు స్థానికులు ఉపయోగించుకోవచ్చు అని ప్రకటించడం వారి ఐక్యతను వారి ఆలోచనను మనం కొనియాడాలని అన్నారు ఏజెన్సీ లాంటి గుండాలలో ప్రజలకు పార్టీలకు అతిథులకు ఉపయోగపడే విధంగా భవనాన్ని నిర్మించుకోవడం చాలా మంచి శుభ పరిణామం అన్నారు. మండలంలోని సర్పంచులు కోరం సీతారాములు, జరుపుల కిషన్, ఈసం సంజీవరావు, భూక్య మంగమ్మ, కృష్ణారావు, కల్తీ రాధా, సుమలత, కల్తీ రజిత, చింతా వెంకటేశ్వర్లు, మాట్లాడుతూ పాత్రికేయులు గా పని చేస్తూ ఏజెన్సీలో వారికే కాక ప్రజలకు ఉపయోగపడేలా భవనాన్ని నిర్మించడం వారి అవునత్యానికి నిదర్శనం అన్నారు దాతల ద్వారా వచ్చిన డబ్బులను వృధా చేయకుండా భవనాన్ని తీర్చిదిద్ది ప్రజలకు అంకితం చేస్తున్నట్లు ప్రకటించడం చాలా మంచి ఆలోచనకు ప్రజలంతా రుణపడి ఉండాలన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎస్కే ఖదీర్, టిఆర్ఎస్ నాయకులు తల్లం భాస్కర్,న్యూ డెమోక్రసీ పార్టీ నాయకులు గడ్డం లాలయ్య, మార్క్స్ లైన్ పార్టీ నాయకులు ఇసం శంకర్, సిపిఎం పార్టీ నాయకులు ఎస్కే జాహిద్, బిజెపి పార్టీ నాయకులు సోలం సతీష్, టీజేఎస్ పార్టీ నాయకులు రమేష్, తుడుం దెబ్బ నాయకులు కొడెం వెంకటేశ్వర్లు, సంక్షేమ పరిషత్ నాయకులు చంద్రయ్య దొర, తుడుం దెబ్బ నాయకులు ఈసం శ్రీను, బీఎస్పీ నాయకులు రాంబాబు, సిపిఎం నాయకులు ఓకే వెంకటేశ్వర్లు, ప్రముఖ వ్యాపారి పట్వారి వెంకన్న, ఏవో వెంకటరమణ తదితరులు ప్రసంగించారు ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ సభ్యులు యాసారపు తిరుపతి, తవిడిశెట్టి నాగరాజు, మాచర్ల రంజిత్, యాసర్పు యాకయ్య, కోడూరి పాపయ్య చారి, గడ్డం నారాయణ, ఎండి యాకూబ్, మార్త రామకృష్ణ, పెండేకట్ల సత్యం, మాచర్ల వంశీ, బత్తిని సారంగపాణి, ఊకే రామకృష్ణ, తన్వోజి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## కళ్లెం హనుమంత్ రెడ్డికి నివాళులర్పించిన బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు వనమా రాఘవేంద్రరావు



**కొత్తగూడెం కలెక్టరేట్, ఆగస్టు 14 ,(ప్రజా జ్యోతి )** పాల్వంచ మండలం లోని రెడ్డిగూడెం కు చెందిన కళ్లెం వెంకటరెడ్డి తండ్రి హనుమంతరెడ్డి శుక్రవారం మరణించారు ,ఈ విషయం తెలుసుకున్న బి ఆర్ ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు వనమా రాఘవేంద్రరావు, జిల్లా నాయకులు,కిలారు నాగేశ్వరావు, కనగాల బాలకృష్ణ ,డిష్ నాయుడు లు హనుమంతు రెడ్డి మృతదేహంపై పై పూలమాలవేసి నివాళులర్పించారు, అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చారు, రాఘవ పూసల విశ్వనాధం వెంకట నారాయణ వీరారెడ్డి ,సంపత్ రెడ్డి తదితరులు ఉన్నారు.

## ఉత్తమ సేవలకు ఉత్తమ పురస్కారం



**గుండాల ఆగస్టు 14 ప్రజా జ్యోతి** ఉత్తమ సేవలందించినందుకు గాను గుండాల మండల అభివృద్ధి అధికారికి ఉత్తమ అవార్డు దక్కింది. గుండాలలో గుండాల మండల అభివృద్ధి అధికారిగా పనిచేస్తున్న దుద్దుకూరు బాలరాజు కు ఆగస్టు 15 సందర్భంగా కొత్తగూడెంలో జరిగే కార్యక్రమానికి ఉత్తమ అవార్డు అందివ్వని ఉన్నారు. గత రెండు సంవత్సరాలుగా గుండాల ఏజెన్సీ మండలంలో పనిచేస్తున్న ఎంపీడీవో కు ఉత్తమ అవార్డు దక్కడంతో పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు

## ఇల్లందు సిండికేట్ సృష్టికర్త కొండపల్లి గణేష్ అరెస్ట్?

- హైదరాబాద్‌లో అరెస్టు చేసిన ఈఓడబ్ల్యూ పోలీసులు?
- కొందరి వద్ద రూ. కోట్లలో డబ్బులు వసూలు చేసినట్లు ఫిర్యాదు
- ఫిర్యాదులపై కేసు నమోదు చేసిన అధికారులు
- ఆర్థిక లావాదేవీలపై దర్యాప్తు ముమ్మరం



**ఇల్లందు, ఆగస్ట్ 14 (ప్రజా జ్యోతి )** ఇల్లందులో 'సిండికేట్' వ్యవహారానికి సంబంధించి కీలక పరిణామం చోటుచేసుకున్నట్లు సమాచారం. ఈ వ్యవహారానికి సృష్టికర్తగా ఆరోపణలు ఎదుర్కొంటున్న కొండపల్లి గణేష్‌ను హైదరాబాద్ లో ఈఓడబ్ల్యూ (ఎకనామిక్ ఆఫెన్సెస్ వింగ్ ) పోలీసులు అరెస్టు చేసినట్లు సమాచారం. అయితే అరెస్టుకు సంబంధించిన పూర్తి వివరాలు, కేసు పూర్వాపరాలు అధికారికంగా వెల్లడించాల్సి ఉంది.

### »» రూ. కోట్లలో వసూళ్ల ఆరోపణలు ...

కొంతమంది వ్యక్తుల వద్ద నుంచి కొండపల్లి గణేష్ భారీ మొత్తంలో డబ్బులు వసూలు చేసినట్లు ఫిర్యాదులు అందిన నేపథ్యంలో కేసు నమోదు చేసినట్లు తెలుస్తుంది. ఈ వ్యవహారంలో రూ. కోట్లలో ఆర్థిక లావాదేవీలు జరిగినట్లు ఫిర్యాదుల్లో పేర్కొన్నట్లు సమాచారం. డబ్బుల సేకరణ, చెల్లింపులు, సంబంధిత వ్యక్తుల మధ్య జరిగిన లావాదేవీలపై అధికారులు దృష్టి సారించినట్లు తెలుస్తుంది.

### »» సిండికేట్ వ్యవహారంపై విచారణ ....

ఇల్లందులో కొంతకాలంగా కొనసాగుతున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న సిండికేట్ వ్యవహారంపై అధికారులు దృష్టి సారించడంతో ఈ పరిణామం చోటుచేసుకున్నట్లు స్థానికంగా చర్చ జరుగుతుంది. సిండికేట్‌లో ఎవరెవరి పాత్ర ఉంది? ఎంత మొత్తంలో డబ్బులు సేకరించారు? ఎక్కడెక్కడ లావాదేవీలు జరిగాయి? అనే అంశాలపై దర్యాప్తు కొనసాగుతున్నట్లు సమాచారం. కొండపల్లి గణేష్ అరెస్టుతో ఈ వ్యవహారంలో మరికొందరి పాత్ర కూడా వెలుగులోకి వస్తుందా? అనే చర్చ మొదలైంది. ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన పత్రాలు, ఖాతాలు, ఇతర ఆధారాలను పోలీసులు పరిశీలిస్తున్నట్లు తెలుస్తుంది. దర్యాప్తు పూర్తయిన తర్వాత మరిన్ని వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉందని సమాచారం. కాగా సిండికేట్ సృష్టికర్త కొండపల్లి గణేష్‌ను పోలీసులు అరెస్టు చేసినట్లు ప్రచారం జరుగుతున్నప్పటికీ పోలీస్ శాఖ నుండి ఇలాంటి అధికారిక ప్రకటన రాలేదు.

# ఆంధ్ర గిరిగిరి.. మజాకా

- వారం... వారం... సక్రమంగా కట్టాల్సిందే
- ఒక్క వారం కట్టకపోయిన వదిలే ప్రసక్తే లేదా
- ఐదుగురు సభ్యులతో గ్రూపుగా ఏర్పాటు చేస్తున్న వైనం
- ఆ గ్రూపులో ఒకరిని లీడర్‌గా నియామకం
- వారానికి ఒకసారి వచ్చి వసూలు చేస్తున్న గిరిగిరి సిబ్బంది
- గ్రూపు సభ్యులు చెల్లించకపోయిన గ్రూప్ లీడర్ చెల్లించాల్సిందే
- ఒక్క వారం కూడా ఆగని గిరిగిరి నిర్వాహకులు
- ఇదెక్కడి తీరని ప్రశ్నిస్తున్న ప్రజలు
- ఆర్బిఐ అనుమతులు ఎక్కడ
- రూ. కోట్లల్లో నడుతున్న గిరిగిరి దందా
- ప్రజల అవసరాలే వారికి పెట్టుబడి
- ప్రైవేట్ సిబ్బందితో వారం వారం వసూళ్లు
- నిబంధనలను తుంగలో తొక్కుతున్న గిరిగిరి నిర్వాహకులు
- ఈ వారం గిరిగిరి దందాకు కళ్లెం వేసేదెవ్వరూ
- ఆర్థికంగా చితికిపోతున్న సామాన్య ప్రజలు
- అధికారులు స్పందించాలని వేడుకోలు



**ఇల్లందు, ఆగస్ట్ 14 (ప్రజా జ్యోతి)** ఇల్లందు పట్టణంలో వారం వారం వసూళ్లతో కొనసాగుతున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న 'గిరిగిరి' దందాపై ప్రజల్లో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతుంది. సామాన్య, మధ్య తరగతి ప్రజల అత్యవసర ఆర్థిక అవసరాలను ఆసరాగా చేసుకోని వారే గ్రూపులుగా ఏర్పాటు చేసి, గ్రూపుకు 5గురు సభ్యులను నియమించి వారానికొకసారి డబ్బులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్న కుటుంబాలకు తక్షణ డబ్బు అవసరాన్ని పెట్టుబడిగా మార్చుకుని వసూళ్ల దందా సాగుతోందని పలువురు అంటున్నారు.

**ఐదుగురితో ఓ గ్రూపు.. ఒకరికి లీడర్ బాధ్యత**

ఈ వారం వారం గిరిగిరి వ్యవహారంలో ఐదుగురు సభ్యులతో ఒక గ్రూపును ఏర్పాటు చేస్తున్నట్లు సమాచారం. ఆ గ్రూపులో ఒకరిని లీడర్‌గా నియమించి, సభ్యుల నుంచి వారానికొకసారి చెల్లింపులు చేయించే విధానం కొనసాగుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. నిర్ణీత సమయంలో సభ్యులు డబ్బులు చెల్లించకపోయినా, ఆ మొత్తాన్ని గ్రూపు లీడర్ చెల్లించాల్సిన పరిస్థితి ఉంటుందని పలువురు వాపోతున్నారు.

**వారం తప్పితే వదిలే ప్రసక్తే లేదా?**

వారం వారం గిరిగిరిలో ప్రతి వారం నిర్ణీత మొత్తాన్ని చెల్లించాల్సిందేనని, ఒక్క వారం చెల్లింపులో ఆలస్యం జరిగినా నిర్వాహకులు ఒత్తిడి చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. గ్రూపు సభ్యుల నుంచి డబ్బులు వసూలు చేసేందుకు ప్రైవేట్ సిబ్బందిని నియమించి, వారానికొకసారి ఆయా ప్రాంతాల్లో తిరుగుతూ నగదు వసూలు చేస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు.

**కోట్లల్లో లావాదేవీలు జరుగుతున్నాయా?**

పట్టణంలో వారం వారం గిరిగిరి వ్యవహారంలో ఇలాంటి గ్రూపులు పెద్ద సంఖ్యలో ఉన్నాయని, వాటి ద్వారా భారీ మొత్తంలో నగదు లావాదేవీలు జరుగుతున్నాయనే చర్చ సాగుతుంది. రూ. కోట్లల్లో ఈ వ్యవహారం కొనసాగుతోందా? అన్న అనుమానాలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి. ఇంత పెద్ద మొత్తంలో ఆర్థిక లావాదేవీలు జరుగుతున్నట్లయితే సంబంధిత శాఖల అధికారులు ఎందుకు దృష్టి సారించడం లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

**ఆర్బీఐ అనుమతులు ఉన్నాయా?**

వారానికి ఒకసారి నగదు వసూలు చేస్తూ ఆర్థిక లావాదేవీలు నిర్వహిస్తున్న ఈ వ్యవస్థకు సంబంధించి చట్టబద్ధమైన అనుమతులు ఉన్నాయా? ఆర్బీఐ నిబంధనలకు అనుగుణంగానే కార్యకలాపాలు సాగుతున్నాయా? అనే ప్రశ్నలు తెరపైకి వస్తున్నాయి. సంస్థలు, నిర్వాహకుల వివరాలు, వసూళ్ల విధానం, సభ్యులకు అందించే రసీదులు తదితర అంశాలపై సంబంధిత అధికారులు సమగ్రంగా పరిశీలించాల్సిన అవసరం ఉందని ప్రజలు కోరుతున్నారు.

**ప్రజల అవసరాలే పెట్టుబడిగా మారుతున్నాయా?**

అత్యవసర ఖర్చులు, కుటుంబ అవసరాలు, వైద్య ఖర్చులు, పిల్లల చదువులు వంటి కారణాలతో చాలా మంది అప్పుల కోసం ఇలాంటి వ్యవస్థలను ఆశ్రయిస్తున్నట్లు తెలుస్తుంది. ప్రజల ఆర్థిక అవసరాలనే పెట్టుబడిగా చేసుకుని వారం వారం వసూళ్లు సాగిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. తక్షణ అవసరానికి డబ్బు తీసుకున్న వారు తిరిగి చెల్లింపుల ఒత్తిడితో మరింత ఆర్థిక ఇబ్బందుల్లో పడుతున్నారని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**నిబంధనలు పాటిస్తున్నారా?**

ప్రైవేట్ సిబ్బందితో ఇంటింటికీ లేదా వ్యాపార ప్రాంతాల్లో తిరుగుతూ వారం వారం నగదు వసూలు చేస్తున్నారనే ఆరోపణల నేపథ్యంలో సంబంధిత అధికారులు స్పందించాల్సిన అవసరం ఉంది. ఈ వ్యవహారంలో ఎలాంటి సంస్థలు పాల్గొంటున్నాయి? వాటికి ఏమైనా చట్టబద్ధ అనుమతులు ఉన్నాయా? సభ్యుల నుంచి ఎంత మొత్తంలో వసూలు చేస్తున్నారు? వసూళ్లకు సరైన రికార్డులు నిర్వహిస్తున్నారా? వంటి అంశాలపై విచారణ జరపాలని ప్రజలు కోరుతున్నారు.

**సామాన్యులపై ఆర్థిక భారం**

ఇప్పటికే పెరుగుతున్న ఖర్చులతో ఇబ్బందులు పడుతున్న సామాన్య ప్రజలు వారానికోసారి చెల్లింపులు చేయాల్సిన పరిస్థితితో మరింత ఆర్థిక ఒత్తిడికి గురవుతున్నారని పలువురు అంటున్నారు. ఒక వారం చెల్లింపు తప్పినా గ్రూపు లీడర్‌పై భారం పడే విధానం ఉంటే, అది కుటుంబాల ఆర్థిక పరిస్థితిపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తమవుతుంది.

**ఈ 'గిరిగిరి' దందాకు కళ్లెం వేసేదెవరు?**

ఇల్లందులో కొనసాగుతున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఈ వారపు వసూళ్ల వ్యవహారంపై ఆర్థిక, పోలీసు, సంబంధిత నియంత్రణ శాఖల అధికారులు సమగ్ర విచారణ చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. అనుమతులు, లావాదేవీలు, వసూళ్ల విధానం, సభ్యులపై ఒత్తిడి వంటి అంశాలను పరిశీలించి వాస్తవాలను వెలుగులోకి తేవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రజల ఆర్థిక అవసరాలను ఆసరాగా చేసుకుని ఎవరైనా నిబంధనలకు విరుద్ధంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లయితే, అలాంటి వ్యవస్థలపై అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని ఇల్లందు ప్రజలు కోరుతున్నారు.

## పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

**వైద్యాధికారి సాయి కళ్యాణ్**




**ములకలపల్లి ఆగస్టు 14 (ప్రజాజ్యోతి ):** వర్షాకాలంలో అంటువ్యాధులు ప్రబలకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మంగపేట పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సాయి కళ్యాణ్ సూచించారు. శుక్రవారం జగన్నాథపురం పంచాయతీ పరిధిలోని తొగ్గుడెం, చింతలకాలనీలో నిర్వహించిన వైద్య శిబిరాల్లో 60 మందికి ఆరోగ్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. జ్వర లక్షణాలున్న 10 మందికి మలేరియా పరీక్షలు నిర్వహించగా నెగిటివ్‌గా తేలిందని వైద్యాధికారి తెలిపారు. శిబిరాన్ని జగన్నాథపురం సర్పంచ్ కుంజా వినోద్ సందర్శించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం వైద్య సిబ్బందితో కలిసి గ్రామంలో పర్యటించి పరిసరాలను పరిశీలించారు. ఇళ్ల చుట్టూ నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## మత్తు పదార్థాలపై అశ్వాపురం పోలీసుల కఠిన చర్యలు

- ఇద్దరు అదుపులో.. పరీక్షల్లో పాజిటివ్
- డీ-అడిక్షన్ సెంటర్‌కు తరలింపు



**అశ్వాపురం ఆగస్టు 14,ప్రజాజ్యోతి** మాదక ద్రవ్యాల వినియోగంపై అశ్వాపురం పోలీసులు కఠిన చర్యలు చేపట్టారు. మత్తు పదార్థాలకు అలవాటు పడిన ఇద్దరిని అదుపులోకి తీసుకుని పరీక్షలు నిర్వహించగా పాజిటివ్‌గా నిర్ధారణ అయింది. దీంతో వారిని చికిత్స, పునరావాసం కోసం భద్రాచలంలోని డీ–అడిక్షన్ సెంటర్‌కు తరలించారు. యువత మత్తుకు దూరంగా ఉండాలి అశ్వాపురం ఇన్‌స్పెక్టర్ చిలువేరు ఎల్లయ్య మాట్లాడుతూ యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచించారు. మత్తుకు బానిసై జీవితాలను నాశనం చేసుకోవద్దని, ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని కోరారు. సమాచారం ఇస్తే గోప్యత మాదక ద్రవ్యాలను విక్రయించడం, కొనుగోలు చేయడం, వినియోగించడం చట్టరీత్యా నేరమని పోలీసులు హెచ్చరించారు. డ్రగ్స్ సరఫరా లేదా వినియోగంపై సమాచారం తెలిసిన వారు వెంటనే పోలీసులకు తెలియజేయాలని, సమాచారం అందించే వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని స్పష్టం చేశారు. మత్తుకు నో చెప్పండి.. జీవితానికి బాటలు వేసుకొండి

## డ్రైనేజీల ఆక్రమణలపై అధికారుల నిర్లక్ష్యం

- నోటీసులతో సరిపెడుతున్నారా.. శాశ్వత పరిష్కారం ఎప్పుడు?

**అశ్వాపురం, ఆగస్ట్ 14, ప్రజా జ్యోతి** అశ్వాపురం మండలంలోని పలు ప్రాంతాల్లో డ్రైనేజీలపై షాపులు, తాత్కాలిక నిర్మాణాలు ఏర్పాటు చేసి వ్యాపారాలు కొనసాగిస్తున్నా సంబంధిత పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. డ్రైనేజీలపై ఆక్రమణల కారణంగా మురుగునీటి ప్రవాహానికి ఆటంకం ఏర్పడటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యపై స్థానికులు పలుమార్లు పత్రికల ద్వారా అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పరిస్థితిలో పెద్దగా మార్పు కనిపించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు అప్పుడప్పుడు నోటీసులు జారీ చేస్తున్నప్పటికీ, వాటి తర్వాత ఆక్రమణల తొలగింపుపై కఠిన చర్యలు తీసుకోకపోవడంతో నోటీసులు కేవలం తాత్కాలిక చర్యలకే పరిమితమవుతున్నాయనే విమర్శలు వస్తున్నాయి. వర్షాలు కురిసిన సమయంలో డ్రైనేజీలు సక్రమంగా పనిచేయకపోతే మురుగు నీరు రోడ్లపైకి చేరి ప్రజలకు మరింత ఇబ్బందులు కలిగే అవకాశం ఉందని స్థానికులు చెబుతున్నారు. పాదచారులు, వాహనదారులు కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొంటున్నారు. ఆక్రమణల తొలగింపునకు చర్యలు తీసుకోవాలి ప్రజా ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని డ్రైనేజీలపై ఉన్న షాపులు, ఆక్రమణలను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. సమస్యను పలుమార్లు తెలియజేసినా 'ఎక్కడ వేసిన గొంగళి అక్కడే' అన్నట్టుగా పరిస్థితి కొనసాగుతోందని వారు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు నోటీసులకే పరిమితం కాకుండా శాశ్వత పరిష్కారం చూపాలని, డ్రైనేజీలను పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.



